ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 16.0



అద్వితీయం

- సేవలు సమృద్ధి.. భక్తజనం సంతృప్తి
- భక్తులకు అందే సేవల ర్యాకింగ్‌లో శ్రీవారి క్షేత్రానికి రెండోస్థానం
- ఫీడ్‌బ్యాక్ ద్వారా ప్రజాభిప్రాయసేకరణ

7

కొల్లేటికోట పెద్దింట్లమ్మకు మొక్కుబడుల చెల్లింపు



కైకలూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులను చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద పాలపొంగళ్ళను పొంగించి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ అర్చకులు విశేష పూజలను నిర్వహించగా కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



స్క్రబ్ టైఫస్ బాధితుడి ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

పారిశుధ్యం పరిశీలన

నూజివీడు టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : స్క్రబ్ టైఫస్ ఫీవర్ కనిపించిన నూజివీడు రామయమ్మ రావుపేట ప్రాంతంలో పారిశుధ్య పరిస్థితులను నూజివీడు డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి పరిశీలించారు. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం బాధితుడు విజయవాడ జీజీహెచ్‌లో వైద్య సేవలను పొందుతున్నాడని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. బాధితుడి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించగా వారికి అనారోగ్య లక్షణాలు లేవన్నారు. కార్యక్రమంలో వైద్యులు కుర్ర నరేంద్ర కృష్ణ, ఇతర వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 2,568 మంది హాజరు

ఏలూరు అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆదివారం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోని 12 సెంటర్లలో నిర్వహించిన జాతీయ ఉపకారవేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈవో వెంకటలక్ష్మమ్మ, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆర్.ఆశ తెలిపారు. మొత్తం 2,654 మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 2,568 మంది హాజరయ్యారని వివరించారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

ఏలూరు టూటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు మండల డివిజనల్, మున్సిపల్ స్థాయిలో విస్తరించినట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు యథావిధిగా పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నామన్నారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అర్జీదారులు తమ ఫిర్యాదుల స్థితి తెలుసుకోవడానికి 1100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలన్నారు.

నేటి నుంచి విధుల్లోకి ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్ నేటి నుంచి తిరిగి విధులకు హాజరు కానున్నారు. వ్యక్తిగత కారణాలతో ఆయన ఈనెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు సెలవు తీసుకున్నారు. సోమవారం నుంచి ఆయన విధులకు హాజరవుతారు.

ఏలూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

లోపలి పేజీలో..



క్యూలైన్లలో దర్శనానికి వెళ్తున్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి ఆలయం

ద్వారకాతిరుమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయంలోని అన్ని విభాగాలు కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండింది. 15 వేల మంది భక్తులు ఆలయానికి వచ్చారు. అన్ని కంపార్ట్‌మెంట్లు భక్తులతో రద్దీగా మారింది. శ్రీవారి ఉచిత దర్శనానికి 2గంటల పైబడి సమయం పట్టింది. దర్శనానంతరం వారంతా స్వామి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరిం చారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- యుటీఎఫ్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ గురుమూర్తి

లోపలి పేజీలో..

రబీకి.. సన్నద్ధం!



కొవ్వలిలో దాళ్వా నారుమడి సిద్ధం చేస్తున్న రైతులు

జిల్లా వ్యవసాయ శాఖ ప్రణాళిక ఖరారు

- 96,567 ఎకరాల్లో వరి సాగు లక్ష్యం
- 4,828 ఎకరాల్లో నారుమళ్లు వేయాలని అంచనా
- 340 క్వింటాళ్ల విత్తనాలు .. 1,40,374 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
- రబీలో సాగు చేసే విత్తనాలు ఎంటీయూ 1121, 1153 రకాలు

జిల్లాలో రబీ ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ఈ ఏడాది రబీలో 96,567 ఎకరాల్లో వరి సాగు చేయాలని రబీ ప్రణాళికలో వ్యవసాయ శాఖ పేర్కొంది. రబీ సాగు చేసే మండలాల్లో 4,828 ఎకరాల్లో వరి నారుమళ్ళు వేయాల్సి ఉండగా 340 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంది. జిల్లాలో సార్వా వరి సాగులో వరి మాసూళ్ల పర్వం ఇంకా కొనసాగుతుండగానే రబీ వరి సాగుకు రైతులు ఉపక్రమిస్తున్నారు.

ఏలూరుసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి 340 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ రబీ ప్రణాళికలో పేర్కొంది. ఏపీ సీడ్స్‌తో పాటు సహకార సంఘాల్లో, ఇతర ప్రైవేటు డీలర్ల వద్ద ఈ విత్తనాలు లభ్యమయ్యే అవకాశాలున్నాయి. మేలు రకమైన విత్తనాలను సాగు చేస్తే అధిక దిగుబడులు రావడానికి అవకాశాలు ఉంటాయి. వ్యవసాయ అధికారులు సూచించిన మేలు రకమైన వరి వంగడాలను సాగు చేస్తే దిగుబడులు లభించడంతో పాటు రైతులకు ఆర్థికంగా లబ్ధి చేకూరే అవకాశాలున్నాయి.

రబీ సాగులో ఈ ఏడాది అనుకున్న స్థాయిలో వరి సాగు జరిగితే 3,09,014 మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. లక్ష్యానికి మించి సాగు జరిగితే ఈ దిగుబడులు పెరిగే అవకాశాలు న్నాయి. వాతావరణం అనుకూలించి సాగు సక్రమంగా జరిగినా వరి దిగుబడులు ఆశించిన దాని కంటే పెరిగే అవకాశాలున్నాయి.

ఎరువులు సిద్ధం

రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 1,40,374 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరం కాగా ఇప్పటికే జిల్లాలో 44,759 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ రబీ ప్రణాళికలో పేర్కొంది. ఇందులో ప్రధానంగా డిసెంబరు సంబంధించి జిల్లాకు 28వేల 738 మెట్రిక్ టన్నులు మాత్రమే ఎరువులు అవసరం అవుతాయని ఆ ప్రణాళికలో పేర్కొన్నారు. అంతకన్నా ఎక్కువగానే ఎరువులు నిల్వలు జిల్లాలో ఉన్నాయని ఆ ప్రణాళికలో జిల్లా వ్యవసాయ శాఖ పేర్కొంది. ఇందులో మార్క్‌ఫెడ్‌లో 6,699 మెట్రిక్ టన్నులు, సహకార సంఘాల వద్ద 9,018 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 23,898 మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ డీలర్లు వద్ద 5,144 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా యూరియా - మిగతా 8వ పేజీలో

వనామి రొయ్యకు వైరస్

- సీడ్ దశలోనే చనిపోతున్న రొయ్యలు
- రైతులు నష్టాల పాలు

కలిదిండి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో వనామి రొయ్యకు వైరస్ సోకడంతో సీడ్ దశలోనే చనిపోవడంతో ఆక్వా రైతులు నష్టాల పాలవుతున్నారు. రొయ్యలసీడ్ వేసిన నెలరోజులకే మృత్యువాత పడుతున్నాయి. కనీసం వంద కౌంట్‌కు రాకుండానే చిన్నసైజు రొయ్యలు చనిపోతుండడంతో స్థానిక వ్యాపారులు వీటిని కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు ఏలూరు, ఆకివీడు మార్కెట్‌కు తరలించి అయికాడికి అమ్ముకుంటున్నారు. గిట్టుబాటు ధర లభిం చకపోవడంతో పెట్టుబడులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. నెల్లూరు, వైజాగ్, కాకినాడ, చెన్నైతో పాటు స్థానికంగా సుమారు 250 హేచరీలు న్నాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో కొన్నిచోట్ల సీడు ఉత్పత్తి పరిమితంగా సాగుతోంది. హేచరీ యాజమానులు లాభార్జనే ధ్యేయంగా రొయ్యల సీడ్‌కు పీసీఆర్ పరీక్షలు జరపకుండా సీడ్ విక్రయించడంతో చెరువుల్లో వేసిన నెలరోజులకే వైరస్ సోకి చనిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. రొయ్యలసీడు హేచరీలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో పుట్టగొడుగుల్లా హేచరీలు పుట్టుకొస్తున్నాయని వీటిపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని రైతులు కోరుతున్నారు.

సీడు వేసే ముందు జాగ్రత్తలు

రొయ్యపిల్లలను చెరువులో వేసే ముందు చెరువులో గుణగణాలను పరీక్షించి తెలుసుకోవాలని మండల మత్స్యశాఖాధికారి రవికుమార్ తెలిపారు. చెరువులో ఒక అడుగు నీరు నిండిన తర్వాత ప్లవకాలు వృద్ధి చెందేలా దృష్టి పెట్టాలన్నారు. సీడ్ వేసే సమయంలో మూడు అడుగుల మేర నీరుపెట్టి అమోనియా నైట్రేట్ వంటి అన్ని పరీక్షలు చేయించుకోవాల న్నారు. అప్పుడే చెరువులో వైరస్ వ్యాప్తి చెందకుండా రక్షించుకోవచ్చన్నారు.



మట్టగుంటలో రొయ్యలను హడావిడిగా పట్టుబడి చేస్తున్న దృశ్యం

35 పైసలు పెరిగిన రొయ్యపిల్ల ధర

రొయ్యపిల్ల ధర అమాంతంగా హేచరీల్లో 35 పైసలకు పెంచారు. మొన్నటి వరకు 25 పైసలుండేది. ఎకరానికి లక్ష నుంచి 2 లక్షల వరకు రొయ్యపిల్లలను చెరువుల్లో వేస్తున్నారు. పెరిగిన ధరతో సీడు కొనుగోలు చేసి చెరువుల్లో వేసి నెలరోజులు గడిచేసరికి వైరస్ సోకడంతో రొయ్యలు మృత్యువాత పడడంతో తీవ్ర నష్టాల పాలవుతున్నారు. ప్రైవేటు హేచరీలపై ఆధారపడటం వలనే వైరస్ సీడు కొనుగోలు చేసి నష్టపోతున్నామని ప్రభుత్వమే హేచరీలు ఏర్పాటు చేసి నాణ్యమైన సీడును ఉత్పత్తి చేయాలని రైతులు కోరుతున్నారు.



పెద్ద పరీక్షే!

- పది ఉత్తీర్ణతకు వంద రోజుల కార్యాచరణ
- అడాప్షన్ ఆఫీసర్ల పర్యవేక్షణ..అభ్యంతరాలు!
- జిల్లాలో 256 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 12వేల మందికి పైగా పరీక్షార్థులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మార్చి పదో తేదీ వరకు విద్యాశాఖ నిర్వహించ తలపెట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రారంభ దశలోనే ప్రకంపనలు పుట్టిస్తోంది. టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణతను పెంచుకునే క్రమంలో చదువులో వెనుకబడిన విద్యార్థులు (రైజింగ్ స్టార్స్) మంచి మార్కులు/గ్రేడులు సాధించడానికి, ఇప్పటికే ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు (షైనింగ్ స్టార్స్) 600/600 మార్కులను వీలైనంత ఎక్కువమంది సాధించేలా ప్రోత్సహించడానికి వంద రోజుల కార్యాచరణను ఉద్దేశించారు. ఆమేరకు అన్ని ప్రభుత్వ ఉన్నతపాఠశాలల్లో పదో తరగతి పరీక్షార్థులకు ఉదయం 8నుంచి 9గంటల వరకు ప్రత్యేక తరగతులు, రెగ్యులర్ క్లాసులు ముగిసిన అనంతరం సాయంత్రం 4నుంచి 5గంటలవరకు సంబంధిత సబ్జెక్టులో పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది. రోజువారీ నిర్వహించే ఈ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను లీప్ యాప్‌లో నమోదు చేయడం, జవాబు పత్రాలను భద్రపర్చడం ద్వారా బాలబాలికల ప్రగతిని పర్యవేక్షించడం, వెనుకబడినవారికి మరింతగా బోధించడం వంటివి చేస్తారు. ఇలా చేయడం ద్వారా టెన్త్ పరీక్షల్లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణతను పొందాలన్నది విద్యాశాఖ లక్ష్యంగా ఉంది. దీనికనుగుణంగానే అన్ని జిల్లాల్లో ఈనెల 6నుంచి మార్చి 10వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు అమలయ్యేలా 100 రోజుల కార్యాచరణను నిర్దేశించారు.

జిల్లాలో 256 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో..

విద్యాశాఖ డైరెక్టర్ సూచనల మేరకు జిల్లాలోని 256 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 100 రోజుల కార్యాచరణ నిర్దేశిత షెడ్యూలు ప్రకారం అమలవుతున్నదీ, లేనిదీ పర్యవేక్షించేందుకు క్షేత్రస్థాయిలో వివిధ శాఖల మండలస్థాయి అధికారులను దత్తత అధికారులు (అడాప్షన్ ఆఫీసర్లు)గా నియమించడానికి వీలుగా జిల్లా విద్యాశాఖకు అనుబంధంగా పనిచేసే జిల్లా కామన్‌పరీక్షల బోర్డు (డీసీఈబీ) ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేసింది. అడాప్షన్ ఆఫీసర్లుగా విద్యాశాఖేతర అధికారులను గుర్తించి వారి ఫోన్ నంబర్లతో సహా, వివరాలను తక్షణమే డీసీఈబీ కార్యాలయానికి పంపాలని ఉత్తర్వులు జారీకాగా, కొన్ని మండలాల నుంచి ఎంఈవోలు తమ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల వారీగా నియమించడానికి వీలున్న రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ, గ్రామీణ నీటిసరఫరా, తదితర శాఖల నుంచి స్థానిక అధికారుల వివరాలతో కూడిన నివేదికలను కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవోలు రూపొందించారు. సంబంధిత శాఖల క్షేత్రస్థాయి అధికారులను అడాప్షన్ ఆఫీసర్లుగా నియమించడానికి ఆయా డిపార్ట్‌మెంట్ల జిల్లా హెచ్‌వోడీలకు ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. మార్చినెల రెండో వారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానుండగా, అప్పటివరకు హైస్కూళ్లలో రెండో శనివారం సెలవులు, ఆదివారం సెలవులతో సహా ప్రత్యేక తరగతులు నిర్ణీత షెడ్యూలు ప్రకారం జరిగేలా పర్యవేక్షించడం అడాప్షన్ ఆఫీసర్ల బాధ్యతగా ఉంటుంది. జిల్లాలో ఈ ఏడాది టెన్త్ పరీక్షలు రాసేందుకు ప్రభుత్వ పాఠశాలల నుంచి 12వేల మందికి పైగా బాలబాలికలు సన్నద్ధమవుతున్నారు. పరీక్షఫీజు చెల్లింపునకు ఇంకా గడువు వున్నందున పరీక్షార్థుల సంఖ్యలో కొద్దిపాటి మార్పులుంటాయి. సెలవు - మిగతా 8వ పేజీలో

కలెక్టర్ అనుమతి రావాల్సి ఉంది

ప్రభుత్వ ఆదేశాలమేరకే అడాప్షన్ ఆఫీసర్ల నియామకం జరుగుతుంది. క్షేత్రస్థాయిలో వందరోజుల కార్యాచరణ విజయవంతం కావడానికే అందుబాటులో ఉండే ఇతరశాఖల అధికారులకు పర్యవేక్షణ అప్పగిస్తున్నామే తప్ప, దీనిపై అభ్యంతరం చెప్పడానికి అవకాశం లేదు. మండలాల వారీగా అడాప్షన్ ఆఫీసర్ల వివరాలను ఎంఈవోల ద్వారా డీసీఈబీ సేకరిస్తోంది. దత్తత అధికారుల నియామకానికి సంబంధిత శాఖల హెచ్‌వోడీలు ఆదేశాలు జారీ చేయడానికి వీలుగా నివేదికను కలెక్టర్‌కు ఒకట్రెండు రోజుల్లో ఇస్తాం.

- వెంకట లక్ష్మమ్మ, డీఈవో

నేడు గిరిజన క్రీడా పోటీలు

ఏలూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖ, భారతదేశ ప్రభుత్వము సంయుక్తంగా, పంచాయితీల (షెడ్యుల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం సంబంధించిన పీసా మహోత్సవం ఈనెల 23, 24 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కోటా రామచంద్రపురం మైదానంలో గిరిజనుల క్రీడలు, జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. పీసా మరథాన్, కబడ్డీ, ఆర్చరీ, రికవర్, గిల్లిదండ, విభాగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఏలూరు జిల్లాలో ఉన్న బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం, ఐదు మండలాల్లోని 66 గ్రామ పంచాయతీలలో ఉన్న 18 ఏళ్ల పైన ఉన్న గిరిజన యువతీ యువకులు పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు, ఆధార్‌కార్డు, అడ్రస్ ప్రూఫ్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఐటీడీఏ కోటా రామచంద్రపురంలో హాజరు కావాలని అజీజ్ సూచించారు. సమాచారానికి 83318 73037 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

వృక్ష విలాపం!

- నిబంధనలకు విరుద్ధంగా గోదావరి కాల్వ గట్టుపై చెట్ల నరికివేత
- అధికారులకు ఫిర్యాదు చేసిన గోదావరి కాల్వ డీసీ చైర్మన్





గోదావరి కాల్వ గట్టుపై చెట్లు నరికివేసిన దృశ్యం

దెందులూరు,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గోదావరి కాల్వ పటిష్టతను దెబ్బతీసేలా కిందిస్థాయి సిబ్బందే కాల్వ గట్లపైన ఉన్న చెట్లను నరికించి వేస్తూ ఆదాయ వనరులుగా మార్చుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొవ్వలి నుంచి సత్యనారాయణపురం వరకు రెండు కిలోమీటర్ల మేర గోదావరి కాల్వ గట్టుపై ఉన్న పెద్ద చెట్లను ఇరిగేషన్ కిందిస్థాయి ఉద్యోగి సహకారంతో కొందరు నరికి అమ్మేసుకుంటున్నారు. పెద్ద మొత్తంలో చెట్లను నరికి తరలిస్తుండగా కొవ్వలి మాజీ సర్పంచ్, గోదావరి కాల్వ డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు జిల్లా అధికారులకు, అటవీశాఖ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఇది గమనించి నరికిన చెట్లను అక్కడే వదిలి కూలీలు ఉడాయించారు. అయితే కరెంట్ వైర్లకు చెట్ల కొమ్మలు తగుతున్నాయని అందుకే నరికిస్తు న్నట్టు ఆ ఉద్యోగి కప్పిపుచ్చే ప్రయత్నం చేశా డు. అసలు కరెంట్ స్తంభాలకు సంబంధం లేని గోదావరి కాల్వ పక్కనున్న చెట్లను నరికి అమ్మేసుకుంటున్న ఆ ఇరిగేషన్ ఉద్యోగిపై చర్య తీసుకోవాలని రైతులు, గోదావరి కాల్వ సంరక్షణ డీసీ చైర్మన్ రాంబాబు కోరుతున్నారు. కాల్వ గట్ల మీద ఉన్న చెట్లను తొలగించాలంటే బహి రంగ టెండర్ పిలిచి అప్పుడు తొలగించాలి. ఆ మేరకు వచ్చిన సొమ్మును ఉన్నతాధికారి పేరు మీద జమ చేయాలి. కానీ ఇక్కడ కొన్నేళ్లుగా నిబంధనలు పాటించడం లేదు. ఈ విషయాలన్నీ తెలిసినా ఇరిగేషన్, అటవీ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

మూడు పంచాయతీలుగా ప్రగడవరం!

గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం

చింతలపూడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చింతలపూడి మండలంలోని మేజర్ పంచాయతీ ప్రగడవరం గ్రామాన్ని మూడు పంచాయతీలుగా విభజించాలని ఆదివారం జరిగిన గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రగడవరం పంచాయతీ వైశాల్యంలో, జనాభాలో పెద్దది కావడం, ఎటువంటి అభివృద్ధి చెయ్యాలన్నా తగిన ఆదాయం లేకపోవడంతో వెనుకబడి ఉంది. విభజనకు గతంలో బ్యాన్ ఉండడంతో చేయలేకపోయారు. ఏడాదిగా ఈ సమస్యపై చర్చ జరుగుతోంది. 25 గ్రామాలు, 18 శివారు గ్రామాలు ఉన్న ఈ పంచాయతీని మూడు పంచాయతీలుగా విభజిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని డిమాం డ్లు వినిపిస్తున్నాయి. ఈ విషయం ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ దృష్టికి తీసుకురావడంతో ఆయన స్వయంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై గ్రామ సభలో తీర్మానం చెయ్యాలని సూచనలిచ్చారు. ఈ నేపథ్యం లో ఆదివారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి పలువురి అభిప్రాయాలు తీసుకున్నారు. ఎవరి నుంచి ఎటువంటి అభ్యంతరం లేకపోవడంతో మూడు పంచాయతీలుగా విభజించాలని తీర్మానం చేశారు. పునుకుమాడు, ప్రగడవరం, వెగలపల్లి పంచాయతీలుగా చేయాలని గ్రామసభలో పలువురు సూచించారు. దీనిపై అభ్యంతరాలేమీ వ్యక్తం కాలేదు. మూడు రోజుల క్రితం చిన్న పంచాయతీలుగా మార్చుకోవ డానికి, సమీప మున్సిపాలిటీలోకి కలపడానికి ప్రభుత్వం బ్యాన్ ఎత్తివేసిం దని టీడీపీ గ్రామాధ్యక్షుడు టి.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సభలో మాజీ ఏఎంజీ అధ్యక్షుడు జె.ముత్తారెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి, కొప్పెర్ల నాగరాజు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న నాయకులు, గ్రామస్థులు



రోడ్ రన్‌లో పాల్గొన్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ, ఏపీఐఐసీ చైర్మన్, ఇతర అధికారులతో సెల్ఫీ తీసుకుంటున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

శారీరక దృఢత్వంతోనే ఆరోగ్యాంధ్ర

తణుకు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వానికి, ఆరోగ్యం కోసం కొంత సమయాన్ని కేటాయించాలని, తద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం తణుకు రన్నర్స్ సొసైటీ, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన తణుకు రోడ్ రన్ 10 కేఎం, 5 కెఎం, 3 కేఎం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఇల్లు, గ్రామం, పట్టణం పరిశుభ్రంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి రోజులో కొంత సమయాన్ని కేటాయించాలని కోరారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ యువత తమ శారీరక ఫిట్‌నెస్ కోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ కార్యక్రమంలో 2,800 మంది యువత ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఆర్‌డీవో ఖతీబ్ కౌసర్ బానో, రోడ్డు రన్ నిర్వాహకులు విశ్వ తేజ, సాయి దీప్, కృష్ణకిరణ్, వినయ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి

రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం చేపట్టిన పీ 4 విధానంలో కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావడం అభినందనీయమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో తణుకులోని చిరు చిరువ్యాపారులకు తోడ్పాటునందించడం కు పీ4లో భాగంగా ఎస్ మెర్సెస్, నెక్ సంయుక్త సహకారంతో తణుకులోని వీధి వ్యాపారులకు బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడి వారి వ్యాపార కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో 20 మంది లబ్ధిదారులకు తోపుడు బండ్లు, ఎగ్ కార్ట్‌ను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎస్‌కె మెర్సెస్ ప్రతినిధులు, నెక్ జోన్ అధ్యక్షుడు మల్లిన శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవకులుగా ఉంటూ నాయకులుగా ఎదగాలి



వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, విప్ నాయకర్, జానకిరామ్, పొత్తూరి

నరసాపురం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సేవకులుగా ఉంటూ నాయకులుగా ఎదిగేందుకు ప్రయత్నం చాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 26వ వార్డు గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన శెట్టిబలిజ జాతిపితామహులు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని విప్ నాయకర్, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సభలో మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. విద్యకు అవసరమైన భూములను దానం చేశారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా యువత మంచి మార్గంలో ముందుకు సాగాలన్నారు. విప్ నాయకర్ మాట్లాడుతూ బీసీలకు ఎప్పుడు అండగా ఉంటానన్నారు. శెట్టి బలిజ కమ్యూనిటీ స్థలాన్ని చూపించి భవనాన్ని ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. దీంతో పాటు వెంకటరెడ్డి కాంస్య విగ్రహాన్ని కూడా సొంత ఖర్చులతో నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే జానకిరామ్, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు మాట్లాడారు. అంతకు ముందు పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

పెరిగిన చికెన్ ధరలు

దిగివచ్చిన వంకాయ ధర.. నిలకడగా ఉల్లి

తాడేపల్లిగూడెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):మార్కెట్‌లో చికెన్ ధర ఒక్కసారిగా కిలోకు రూ.40 పెరిగింది. కార్తీక మాసం వెళ్లిన ఒక వారం వరకు నిలకడగా ఉన్న చికెన్ ఒక్కసారిగా పెరిగింది. గత ఆదివారం కూడా కిలో స్కిన్ లెస్ చికెన్ కిలో రూ.220కు విక్రయించారు. విత్ స్కిన్ రూ.200 అమ్మారు. డిసెంబరు 3వ తేదీన కిలో స్కిన్‌లెస్‌కు రూ.240కు పెరిగింది. 4వ తేదీన మరో రూ.20 పెరిగి ఏకంగా రూ.260కు చేరింది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఒక్క రోజునే 120 టన్నుల చికెన్ వినియోగమవుతుంది. మిగిలిన రోజుల్లో రోజుకు జిల్లా వ్యాప్తంగా వినియోగం 35 టన్నులు మాత్రమే ఉంటుంది. ఇక కార్తీక మాసం వెళ్లడంతో కోడిగుడ్ల ధరలు పెంచేశారు.

కూరగాయల ధరలు పెద్దగా తగ్గకపోయినా వంకాయ ధర మాత్రం అమాంతంగా తగ్గింది. గతవారం రూ.90 వరకు విక్రయించిన వంకాయ ఇప్పుడు రూ.50కు వచ్చేసింది. గుచ్చిపూల వంకాయ ధర కిలో రూ.120 వరకు వెళ్లింది. ఇప్పుడు వంకాయ మార్కెట్‌కు రావడంతో వీటి ధరలు తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. వర్షాలు తగ్గి చలికాలి పెరిగితే వంకాయల కాయడానికి అనువుగా ఉంటాయని చెబుతున్నారు. దీనిలో భాగంగా వంకాయ ఉత్పత్తి పెరిగిందని దీంతో ధరలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. చిక్కుళ్లు మాత్రం టమాట్‌లో ఉన్నాయి. నాటుచిక్కుళ్లు కిలో రూ.150కు అమ్ముతున్నారు. సాధారణ చిక్కుళ్లు రూ.80, బీర రూ.80, బెండ రూ.60, దొండ రూ.60, బీట్‌రూట్ రూ.80, క్యారెట్ రూ.80, టమాటా రూ.30, దోసకాయలు రూ.50, కీరదోస రూ.50 క్యాప్సికం రూ.100, కాకర రూ.60, కొత్తిమెంతు రూ.60, కంద రూ.60, క్యాబేజీ రూ.40, కాలీఫ్లవర్ ఒక్కటి రూ.30, మునగ కాయలు జత రూ.70కు, కొత్తిమీర కట్ట రూ.20కు అమ్ముతున్నారు.

ఉల్లి ధరలు మాత్రం నిలకడగానే ఉన్నాయి. తాడేపల్లిగూడెం మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి 255 టన్నుల ఉల్లి వచ్చింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన అత్యంత నాణ్యమైన ఉల్లి హోల్‌సేల్‌గా క్వింటా రూ.1800 నుంచి 2000 మధ్య విక్రయించారు. మధ్యరకం ఉల్లి క్వింటా రూ.1000 నుంచి రూ.1500 మధ్య విక్రయాలు సాగాయి. ఇక రిటైల్‌గా రూ.100 నాణ్యమైన ఉల్లి 4 కిలోలు, మధ్యరకం రూ.100కు 5కిలోలు, సాధారణ రకం రూ.100కు 6కిలోలు కూడా అమ్మారు.



అద్వితీయం

- సేవలు సమృద్ధి.. భక్తజనం సంతృప్తి..
- భక్తులకు సేవల ర్యాంకింగ్‌లో శ్రీవారి క్షేత్రానికి రెండో స్థానం
- ఫీడ్‌బ్యాక్‌తో ప్రజాభిప్రాయ సేకరణ

ద్వారకాతిరుమలలోని శ్రీవారి ఆలయం (ఇన్‌సెట్) ఉభయ దేవేరులతో శ్రీవారు

భక్తుల అన్నప్రసాద భవనం





శ్రీవారి లడ్డు ప్రసాదం

ద్వారకాతిరుమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు వచ్చే భక్తులకు దేవతా మూర్తుల దర్శనంతో పాటు, మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన ప్రసాదం అందించడం అక్కడి అధికారుల కనీస బాధ్యత. దీనిపై అటు ప్రభుత్వంతో పాటు ఇటు ఆలయ ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించారు. ఈ క్రమంలో భక్తులకు పోన్లు చేసి ఆలయాల్లో అందే సేవల పై అభిప్రాయాలు సేకరించారు. రాష్ట్ర దేవాలయాల్లో భక్తులకు అందే సేవలపై గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది నవంబరు నెల వరకు అభిప్రాయాలు సేకరించారు.

సర్వే జరిగిందిలా..

రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో భక్తులకు మెరుగైన సేవలందించాలని ప్రభుత్వం ఎప్పటి కప్పుడు సూచిస్తూనే ఉంది. అయితే కొందరు అధికారులు ఆ ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ఆశించిన స్థాయిలో భక్తులకు సేవలు అందడం లేదనే వాదన వినిపిస్తోంది. భక్తులకు గత ఏడాదిన్నర కాలంగా అక్కడ అందే సేవల పై ప్రభుత్వం ఆరా తీసింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని జాయింట్ కమిషనర్ హోదా కల్గిన ప్రధాన

రాష్ట్రంలోని ఏడు ప్రధాన ఆలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చిన భక్తులకు మెరుగైన సేవలందించడంలో 71.5 శాతం తో రెండో స్థానం లభించగా సంతృప్తకరమైన స్థాయిని దక్కించుకుంది. స్వామి వారి దర్శనం సంతృప్తికరంగా ఉందా.. మౌలిక సదుపా యాలు బాగున్నాయా.. ప్రసాదం తాజాగా, రుచిగా ఉందా అన్న ప్రశ్నలతో భక్తుల నుంచి సేకరించిన ఫీడ్ బ్యాక్ ద్వారా ఈ స్థానం లభించింది. శ్రీకాళహస్తి 72.7 శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా, 70.4తో మూడో స్థానంలో అన్నవరం, 70 శాతంతో నాలుగో స్థానంలో కాణిపాకం, 68.8తో సింహాచలం ఐదో స్థానం, 67.8తో శ్రీశైలం ఆరో స్థానంలో నిలవగా చివరి స్థానంలో 66 శాతం సంతృప్తితో ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయం నిలిచింది. ఉప కమిషనర్ హోదా కల్గిన రాష్ట్రంలోని 14 ముఖ్య ఆలయాల్లో మోపిదేవి ఆలయం, నిడదవోలు కోట సత్తెమ్మ ఆలయాలు 70.2 శాతంతో మొదటి స్థానంలో ఉన్నాయి.

7 ఆలయాలను ఒక విభాగంలోను, డిప్యూటీ కమిషనర్ హోదా కల్గిన 14 ముఖ్య ఆలయాలను మరో విభాగంలోను చేర్చారు. భక్తులకు ఫోన్లు చేసి వారు దర్శించిన ఆలయం.. అక్కడ సౌకర్యాలు, ఆసౌకర్యాలపై అభిప్రాయ సేకరణ జరిపారు. దైవ దర్శనంలో ఇబ్బంది లేదన్న కన్నారా.. తాగునీరు, వసతులు, పారిశుధ్యం సంతృప్తినిచ్చాయా.. అన్న అంశాలపై ఫీడ్ బ్యాక్ తీసుకుని పర్సంటేజీలు కేటాయించారు.

మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం..

గతంలో భక్తుల అంతరాలయ దర్శనం లేదని అసంతృప్తిగా ఉండేవారు. కరోనా సమయంలో నిలుపుదల చేసిన అంతరాలయ దర్శనాన్ని ఇటీవల ఎన్వీ సత్యన్నారాయణమూర్తి కృషితో ఇటీవలే పునరుద్ధరించారు. ప్రస్తుతం అమ్మవార్ల ముందు నుంచి కూడా గతంలో వలే దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవార్లను సాధారణ భక్తులు సైతం మరింత దగ్గర నుంచి చూసే అవకాశం కలుగుతుంది. దీంతో రానున్న సర్వేలో మరింత మెరుగైన ఫలితాలు వచ్చి పర్సంటేజ్ పెరిగి రానున్న రోజుల్లో ప్రథమ స్థానాన్ని పొందాలని ఆశిద్దాం.



క్షేత్రంలో భక్తులకు మినరల్ వాటర్

మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం..



స్వయంవ్యక్తమూర్తిగా చినవెంకన్న దివ్యమూర్తులు కొలువుదీరిన ద్వారకా తిరుమలను ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు సూచనలతో మరింత అభివృద్ధి చేస్తాం. ఇప్పటికే అంతరాలయ దర్శనాన్ని పునరుద్ధరించాం.. అలాగే పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నాం.. శుద్ధమైన తాగునీటిని, రుచికరమైన ప్రసాదాలను భక్తులకు అందిస్తున్నాం. కోట్లాది రూపాయలు వెచ్చించి ఎన్నో సౌకర్యాలను కల్పిస్తున్నాం. భక్తులకు భవిష్యత్‌లో చక్కని దైవదర్శనంతో పాటు మెరుగైన సౌకర్యాలు మరిన్ని కల్పిస్తాం.

-ఎన్వీ సత్యన్నారాయణమూర్తి, ఆలయ ఈవో, ద్వారకాతిరుమల



పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో జిల్లా సాధన సమితి ధర్నా

పోలవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

పోలవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలవరం కేంద్రంగా జిల్లా ప్రకటించాలని స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో పోలవరం జిల్లా సాధన సమితి నాయకులు ధర్నా నిర్వహించారు. నాయకులు బుగ్గా మురళీకృష్ణ, సొబ్బన ఆనందరావు తదితరులు మాట్లాడుతూ పోలవరం జిల్లా కేంద్రంగా పోలవరం జిల్లా ప్రకటిస్తే స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని కలలు కన్న ప్రజల ఆదిలోనే హంసపాదు ఎదురయ్యాయన్నారు. ప్రభుత్వం స్పందించి పోలవరాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధర్నాతో ఏటిగట్టు సెంటర్ వద్ద ట్రాఫిక్ స్తంభించింది. జిల్లా సాధన సమితి నాయకులు సొబ్బన మోహన్, రాజశేఖర్ బాబు, ఎస్‌కె పాతిమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల నిరసన



బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గ జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని గుంజవరం, అమ్మపాలెం, చీమలవారి గూడెం గ్రామాల్లో గిరిజనులు నిరసన తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం పోలవరం పేరుతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రంపచోడవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లేకపోవడం బాధాకరమన్నారు. పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లోని షెడ్యూల్ ప్రాంతం, కొయ్యలగూడెం, గోపాలపురం, టి.నర్సాపురం మండలాల్లో ఉన్న 28 ఆదివాసీ గ్రామాలను కలుపుతూ పోలవరం జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలుపుతూ నూతన జిల్లా ఏర్పాటు చేయకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. నాయకులు పోలోజు నాగేశ్వరరావు, కొర్స రామిరెడ్డి, ఎం.చిన్న రావు, చూంచు సూర్యారావు, ఎంపీటీసీ ఆదినారాయణ పాల్గొన్నారు.

పునరాలోచించాలి : అక్కినేని వనజ, సీపీఐ

జీలుగుమిల్లి: పోలవరం జిల్లా ఏర్పాటుపై ప్రభుత్వం పునరాలోచించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ అన్నారు. పార్టీ స్థాపించి వందేళ్ల పూర్తయిన సందర్భంగా జీలుగుమిల్లిలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులకు సేటికి సరైన నష్టపరిహారం కల్పించలేదన్నారు. నాయకులు ఎండీ మున్సీర్, కృష్ణచైతన్య, కరం దారయ్య, బోడిక రాము, బీసన్‌సాగర్, కొవ్వల నాగరాజు ఉన్నారు.

పోలవరం నియోజకవర్గాన్ని చేర్చాలి: రవి, సీపీఎం

కుక్కునూరు: ప్రభుత్వం ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలో షెడ్యూల్ గ్రామాలు, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, గోపాలపురం మండలాల్లోని 28 నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలు చేర్చాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఆదివారం కుక్కునూరులో జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలేకపోవడం దారుణమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను కలుపుతూ జిల్లా చేస్తానని చెప్పిన సీఎం పోలవరం లేకుండా జిల్లా ప్రకటించడం సరైందికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రజల అభిప్రాయం మేరకు పోలవరం నియోజక వర్గాన్ని పోలవరం జిల్లాలో కలపాలని లేదంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మడియం నాగమణి, వైనాగేంద్ర రావు, వై.సాయికిరణ్, బొయ్యన శ్రీను, లక్ష్మయ్య, రమేశ్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ గురుమూర్తి

దెందులూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వాలు తీవ్రంగా నష్టపోయాయని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. ఆదివారం దెందులూరు టీడీపీ కల్యాణ మండపంలో యూటీఎఫ్ జిల్లా 4వ కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని కోరారు. తెలుగు కామేడీ షేక్ సాబ్జీకి నివాళులు అర్పించారు. ఎస్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చోడవరపు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు తోట కేదారి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, మనోహర్ సుభానీ, హరినాథ్, నంబూరి రాంబాబు, మేకా లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గురుమూర్తి



అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులు

మేడల్లో అమ్మవార్లకు విశేష పూజలు

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏలూరులోని తూర్పువీధి ఆలయ ప్రాంగణంలో జాతర సేవల్లో అమ్మవార్లను మేడల్లో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఆదివారం పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు మేడల్లో అమ్మవారిని దర్శించుకుని ఆరాధించారు. పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపారు. నివేదనలు సమర్పించారు. గంగానమ్మ, పోతురాజు బాబుల సన్నిధిలో భక్తులు కుంభం పోసి ఆరాధించారు. భక్తులతో, పూజలతో ఆలయ ప్రాంతం కిటకిటలాడింది. ఆలయ అధ్యక్షులు వంకినేని భానుప్రసాద్, జాతర కమిటీ నాయకులు కల్లేపల్లి నరసింహారావు, మాజీ కార్పొరేటర్ మారం హనుమంతరావు భక్తులకు ఏర్పాట్లు చేశారు.



మేడలో కొలువైన అమ్మవార్లు

ముగిసిన రాష్ట్ర స్థాయి టాంగ్-థా ఎంపిక పోటీలు

పరవాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పరవాడ ఇండోర్ స్టేడియంలో టాంగ్-థా అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఏడు జిల్లాల నుంచి 250 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఆద్యంతం పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కే.ఎం.నాయుడు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 17 నుంచి 22వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి టాంగ్-థా పోటీల్లో 36 మంది విద్యార్థులు పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ఎంపీ.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి అచ్చెమ్మ, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర పరిశీలకులు శ్రీహరిరావు, పీడీ ప్రసాద్, నాయుడు, ప్రతినిధులు జి.రాజు, ఎ.సూరాజు, ఎస్.శ్రీనివాస్, పి.లక్ష్మి పాల్గొన్నారు.



హైవే పక్కన ఆగిన కారు

తృటిలో తప్పిన పెనుప్రమాదం

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఒక కారు ఎగిరి పడి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. తణుకు నుంచి భార్యభర్తలు తాడేపల్లిగూడెం వస్తుండగా నిట్ కళాశాల జంక్షన్ వద్ద అడ్డుగా మరో వాహనం రావడంతో కారు బ్రేక్ వేశారు. దీంతో కారు ఎగిరి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి ఆగింది. దీంతో భార్య భర్తలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు ఎగిరిపడిన సమయంలో ఏ లారీ లాంటి వాహనం వచ్చి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

లింగపాలెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెం, కొణిజర్ల రహదారిలో టిప్పర్ లారీ ఢీ కొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం మండలంలోని కొణిజర్ల గ్రామానికి చెందిన సిహెచ్.వెంకటేశ్వరరావు(60)అనే వ్యక్తి రోడ్డుపై ఉండగా టిప్పర్ లారీ రివర్స్‌లో వెనక్కి వస్తూ ఢీకొట్టడంతో వెంకటేశ్వరరావు అక్కడి కక్కడే మృతి చెందారు. అటువైపుగా వెళ్తున్నవారు కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో ధనుష్‌కు గోల్డ్ ప్రోకార్డు

చింతలపూడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):ఇటీవల ఢిల్లీలో మస్కిల్‌మేనియా ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో ఏలూరు జిల్లా చింతలపూడికి చెందిన కంపసాటి ధనుష్ గోల్డ్ ప్రోకార్డు సాధించారు. ఈ పోటీలో ధనుష్ తన కండల సౌష్టవం ప్రదర్శిస్తూ తదారీలో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ఆయన విజయం సాధించి గోల్డ్ ప్రోకార్డు అందుకున్నారు. ఢిల్లీలో యూపీఎస్సీ పరీక్షల కోసం ఢిల్లీలో శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణ కూడా సివిల్స్ సాధించాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. గ్రామస్థాయి, జిల్లా స్థాయి అండర్ రాష్ట్ర పోటీల్లో పలు అవార్డులు పొందిన ధనుష్ జాతీయ స్థాయిలో గోల్డ్ ప్రోకార్డు పొందడం తర్వాలో యూఎస్ఏలో జరిగే అంతర్జాతీయ పోటీలకు భారతదేశం తరఫున పాల్గొనబోతున్నారు. ఇందుకు అవకాశం లభించడంతో ఈ గోల్డ్ వేదికపై జరిగే పోటీల్లో విజయం సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదేవిధంగా సివిల్స్ పరీక్షల్లో విజయం సాధించాలని శిక్షణ పొందుతున్నట్టు తెలిపారు. మండలంలోని పట్నంగూడెం గ్రామానికి చెందిన కంపసాటి సత్యనారాయణ, పార్వతి దంపతుల కుమారుడైన ధనుష్ శిక్షణ తీసుకుంటూనే స్వయంకృషితో ఈ విజయం సాధించడంతో స్థానికులు పలువురు అభినందనలు తెలియచేస్తున్నారు.



గోల్డ్ ప్రోకార్డుతో ధనుష్

ఏలూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే శాఖ ఏలూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడుపనుంది. రైలు నెంబర్ 07148 చర్లపల్లిలో ఈ నెల 8వ తేదీ రాత్రి 9.35 గంటలకు బయల్దేరి 9వ తేదీ రాత్రి 11.50 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. రైలు నెంబర్ 07149 షాలిమార్‌లో ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరి 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రెండు రైళ్లు గుంటూరు జంక్షన్, విజయవాడ జంక్షన్, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట జంక్షన్, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం జంక్షన్, శ్రీకాకుళంరోడ్, బరంపూర్, కుర్దా రోడ్ జంక్షన్, భువనేశ్వర్, కటక్, బాద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్ జంక్షన్, సంత్రాగాంజి స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్లలో టూటైర్ ఏసీ, త్రీటైర్ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని తెలిపారు.

జూదాలను అరికట్టాలి.. డీవైఎఫ్ఐ డిమాండ్

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లాలో కోడి పందాలు, జూదాలు జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, తద్వారా యువత సన్మార్గంలో నడిచేందుకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎన్.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. ఏలూరులోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేకాట, గుట్కా, గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాల బారిన పడి యువత భవిష్యత్ నాశనమవుతున్నాయని, డ్రగ్ కల్చర్ విపరీతంగా పెరుగుతోందని వాపోయారు. డ్రగ్స్ వ్యవహారంపై గతంలో గళ మెత్తిన నెల్లూరు జిల్లా యువజన నాయకుడు పెంచలయ్యను గంజాయి ముఠా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పోలీసులు అర్భాటపు ప్రకటనలు తప్ప కోడి పందాలను నిలువరించలేకపోతున్నారని విమర్శించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.శివశంకర్, నాయకులు పవన్ రవికుమార్, జె.గోపి, మహేశ్, లోకేంద్ర, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

12న క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలు

ఏలూరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 12న ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రాస్ కంట్రీ జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, గొర్లె ప్రసాదరావు, దేవరపల్లి ప్రసాద్ తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపిక చేసిన క్రీడాకారులు ఈ నెల 24న కాకినాడ జిల్లా, పెద్దాపురంలోని ఎంఆర్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు అండర్-16, 18, 20 విభాగాలలో బాల బాలికలు, పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు, వయస్సు ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సీ మార్క్స్ లిస్టుతో 86865 40555 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వ్యాను

రేషన్ బియ్యం స్వాధీనం

కామవరపుకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం తడికలపూడి సెంటర్‌లో తడికలపూడి పోలీసు సిబ్బంది వాహనాలు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్తున్న టాటా వ్యానులో తనిఖీలో నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని ప్రభుత్వం నుంచి ఉచితంగా వచ్చే పథకం లబ్ధిదారులు నుంచి తడికలపూడిలో ద్వారకాతిరుమల వైనెమిల్లు ఆదినారాయణకు తరలిస్తున్న సందీప్‌ను అప్పగించారు. తడికలపూడి పోలీసులు, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ శేషగిరిలు కేసు నమోదు చేశారు.

వ్యభిచారం కేసులో ముగ్గురి అరెస్టు

యలమంచిలి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాజ గ్రామంలో వ్యభిచారం కేసులో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు.సమాచారం మేరకు పోలీసులు శనివారం రాత్రి ఆకస్మిక దాడి చేసి ఇద్దరు విటులు, ఒక మహిళను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.గుర్నాధరావు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

● ఏలూరులోని పవర్‌పేటలో రైల్వే గేటు పడుతున్న ఆటో వాలాలు ఆగేదేలేదంటూ దూసుకెళ్తూ ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. సోమవారం రాత్రి 6.25 గంటల సమయంలో గేటు పడుతున్నా ఆగకుండా వెళ్లడంతో ఆటోలు పట్టాల మధ్యే నిలిచిపోయాయి. దీంతో గేటు మరోసారి ఎత్తాల్సి వచ్చింది. ఇలాంటి ఆటోవాలాల వల్ల విమర్శలు వెల్లివెత్తుతున్నాయి.



గుబ్బలమంగమ్మ సన్నిధికి తరలివచ్చిన భక్తులు

బుట్టాయగూడెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మన్యంలో ఉన్న వనదేవత గుబ్బల మంగమ్మను ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. దర్శనాలకు వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల కోసం కమిటీవారు అన్ని ఏర్పాట్లు చేయడంతో భక్తులు త్వరగా దర్శనాలను ముగించుకున్నారు.

డీపీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):డెమోక్రటిక్ పీఆర్టీయూ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏలూరులో నిర్వహించిన సంఘ సమావేశంలో ఎన్నుకున్నట్టు డీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాస్, కోశాధికారిగా ఎన్‌వీకే వీరబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రం శాఖ అధ్యక్షులుగా ఆర్.నాగవెంకటేశ్వరరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా జి.గోపికిషోర్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా టి.సందీప్, రాష్ట్ర కార్యదర్శిగా కె.సూర్యచంద్రరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్.నాగేంద్రసింగ్ ఎన్నికయ్యారని వివరించారు. నూతన కార్యవర్గానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను, రాష్ట్ర సలహాదారు ఎం.అచ్యుతరావు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సంఘ తొలిసమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను సాధించుకోవడానికి రాష్ట్ర నాయకత్వం ద్వారా పని చేస్తామన్నారు.

ఎస్ఎఫ్‌ఐ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ జిల్లాశాఖ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బి.మనోజ్, కె.లెనిన్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన మహాసభ సందర్భంగా ఎన్నికలు జరిగాయి. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎం.జయంత్, ఎస్.శివాజీ, ఎస్.పవన్, కె.అమూల్య, సహాయ కార్యదర్శులుగా డి.నాగేంద్ర, జి.రమ్య, పి.సతీష్, జిల్లా కమిటీ సభ్యులుగా శివ, రాజు, వీరేంద్ర, సరిత, శేషాద్రి, సందీప్‌చరణ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో సంఘ జిల్లా నాయకులు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వపాఠశాలల్లో జరిగిన మెగా పేరెంట్-టీచర్ సమావేశాలను రాజకీయ కార్యక్రమాల ప్రచారానికి ప్రభుత్వం వేదికగాచేసుకుని, స్కూలు వాతావరణాన్ని కలుషితంచేసిందని ఆరోపించారు. విద్యాసంస్థల్లోకి రాజకీయపార్టీలు, విద్యార్థి సంఘాలు ప్రవేశించకూడదని సర్క్యులర్లు జారీ చేసిన ప్రభుత్వమే వాటిని ఉల్లంఘించిందని విమర్శించారు. జిల్లాలోని సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడంలేదని ఆరోపించారు. విద్యాసంస్థలకు సకాలంలో విద్యార్థులుచేరుకునేలా అన్ని ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు నడపడానికి తమవంతు ప్రయత్నంచేస్తామన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం ప్రోత్సాహకం

ఏలూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకం అభినందనీయమని ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా సదస్సులో వక్తలు కొనియాడారు. ఆదివారం ఉదయం ఏలూరులో కాశీ విశ్వేశ్వర కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనెగుంట కోటేశ్వరరావులు మాట్లాడుతూ దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు 7 వరాలను అమలు చేస్తోందన్నారు. ఏలూరులో ఏ సమస్య వచ్చినా దివ్యాంగులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే బడేటి చంటి భరోసా ఇచ్చారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు



ఏలూరు క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసులు ఆదివారం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. రికార్డులు సరిగా లేని వాహనాలకు ఇ-చలానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, ఇన్సూరెన్సు, వాహనం నడిపేవారికి డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు ట్రిపుల్ రైడింగ్ చేయరాదని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీసులకు ప్రాధాన్యమని ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని అందరూ నియమాలు ఖచ్చితంగా పాటించాలన్నారు.

రైతులను వేధిస్తున్న గోనె సంచుల కొరత

చింతలపూడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చింతలపూడి మండలంలో ధాన్యం తరలింపు విషయంలో సంచుల కొరత రైతులను ఇంకా వేధిస్తూనే ఉంది. చింతలపూడి ఆర్ఎస్‌కే 1, 2 కేంద్రాల్లో గత పది రోజులుగా సంచుల కొరత ఏర్పడింది. మిగతా ఆర్ఎస్‌కేలలో సంచులు ఉన్నప్పటికీ రైతులు అడిగితే ఇవ్వడంలేదని సమ్మోటవారిగూడేనికి చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. పది రోజులుగా గోనె సంచుల కోసం ఆర్ఎస్‌కేల చుట్టూ తిరుగుతున్నామని చెప్పారు. అధికారులు రైతుల గోడు వినకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ధాన్యాన్ని తరలించడానికి సంచుల కొరత తీర్చాలని కోరారు. దీనిపై ధాన్యం కొనుగోలు చేసే చింతలపూడి సొసైటీ కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ సమ్మోటవారిగూడెం, పాత చింతలపూడి ఏరియాల్లో ఈ సమస్య ఉందని, ఆ రెండు ప్రాంతాలకు సంబంధించిన రైతు సేవా కేంద్రాల్లో సంచుల కొరత ఉందని అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడంలేదని తెలిపారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న బాబ్జీ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక క్రైస్ట్ ఇవాంజలికల్ లూథ రన్ మినిస్ట్రీస్‌కు చెందిన బిషప్ జాన్సన్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ మాట్లాడుతూ పేదలను ఆపదలో ఆదుకోవడం అభినందనీయమని బిషప్ జాన్సన్‌ను అభినందించారు. అనంతరం బిషప్ జాన్సన్ మాట్లాడుతూ శ్రీనివాసపురంలోని వంద మంది పేదలకు, జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఉప్పలమెట్టలోని అరవై కుటుంబాలకు సరుకులు అందజేశారు.

పెద్ద పరీక్షే!

(5వ పేజీ తరువాయి)

రోజుల్లో సైతం నిర్వహించే ప్రత్యేక తరగతులను విద్యార్థులు నూరుశాతం విజయవంతంగా వినియోగించుకునేందుకు వీలుగా ఆయా రోజుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయడానికి విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులిచ్చింది.

విద్యాశాఖేతర అధికారులతో టీచర్లను అగౌరవపరుస్తారా?

వందరోజుల కార్యాచరణను హైస్కూలుస్థాయిలో విద్యాశాఖేతర అధికారులతో పర్యవేక్షింపజేయడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నాయి. బోధనా కార్యక్రమాలు, పాఠ్యాంశాలు, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలతో పరిచయంలేని ఇతరశాఖల అడాప్షన్ ఆఫీసర్లు రోజువారీ పర్యవేక్షణతో ఉపాధ్యాయుల తప్పులను వెతకడానికే ప్రాధాన్యతనిస్తారని అభ్యంతరం చెబుతున్నాయి. అవసరమైతే విద్యాశాఖకు సంబంధించిన సీనియర్ హెచ్‌ఎంలు, డైట్ కళాశాలల అధ్యాపకులు, డీవైఈవోలు, ఎంఈవోలతో వందరోజుల కార్యాచరణను రోజువారీగా పర్యవేక్షించుకోవడానికి నియమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. గతంలోను టెన్త్ పరీక్షార్థులకు వందరోజుల కార్యాచరణను అమలు చేసినప్పటికీ ఇప్పటి మాదిరిగా ఇతర శాఖల నుంచి అడాప్షన్ ఆఫీసర్లను పర్యవేక్షకులుగా నియమించలేదని గుర్తుచేస్తున్నాయి. దీనిపై ఏపీటీఎఫ్-1938 జిల్లా నాయకులు కృష్ణ, మోహన్, శ్రీనివాసరావు మాట్లాడుతూ వందరోజుల కార్యాచరణతో ఉపాధ్యాయులపై అనవసరమైన పనిభారం పెరుగుతుందని, పాఠ్యాంశాల రివిజన్ తగ్గిపోవడం వల్ల ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు బోధన కంటే లీప్ యాప్‌లో అప్‌లోడ్, డేటా ఎంట్రీ పనులకే ఎక్కువ సమయం ఇవ్వాల్సి ఉంటుందని, ఇది బోధనేతర పనులతో టీచర్లను వేధించడమేనని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతరశాఖల అధికారులకు పర్యవేక్షణ అప్పగించడం, యాప్‌లో టీచర్లే మార్కులు అప్‌లోడ్ చేయాల్సి రావడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అవసరమైతే లీప్ యాప్‌లో మార్కులను అప్‌లోడ్‌చేసే బాధ్యతను సీఆర్పీ/సీఎంఆర్టీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

రబీకి..సన్నద్ధం!

(5వ పేజీ తరువాయి)

12,305 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,727 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకే 17,865 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 4,034 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పి 6,828 మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధంగా ఉంచారు. రబీ సీజన్‌లో ఈ ఎరువులను రైతులు వినియోగించుకోవచ్చు.

60.49 శాతం వరి మాసూళ్లు పూర్తి : జిల్లాలో ఈ ఏడాది సార్వా సీజన్‌లో 2,07,286 ఎకరాల్లో వరి సాగు జరిగింది. ప్రస్తుతం వరి మాసూళ్ల పర్వం జోరుగా సాగుతోంది. ఇప్పటివరకు 1,25,402 (60.49 శాతం) ఎకరాల్లో వరి మాసూళ్లు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో వరి మాసూళ్ల పర్వం త్వరితగతిన పూర్తయితే రబీ వరి నారుమళ్ల ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

సూర్యఘర్ యోజనకు బాలారిష్టాలు

పలు కారణాలతో బ్యాంకర్లు వెనకడుగు
సహకరించాలంటున్న విద్యుత్ శాఖ

ఏలూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ బిజిలి యోజన లక్ష్యానికి ఆదిలోనే ఆటంకం ఏర్పడుతోంది. సౌర పలకాల ఏర్పాటులో విద్యుత్ శాఖ బాలారిష్టాలను ఎదుర్కొంటోంది. ఏలూరు రూరల్ మండలంలో రెండు వేలకు పైగా సోలార్ సెట్లు ఏర్పాటే లక్ష్యంగా విద్యుత్ అధికారులు కృషి చేస్తున్నారు. కానీ, సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుందామని ముందుకొచ్చిన లబ్ధిదారుల్లో 70 శాతం మందికి సిబిల్ స్కోరు లేదంటూ బ్యాంకర్లు వెనకడుగు వేస్తున్నారు. మరికొంత మంది తమ ఇంటికి పూర్వీకుల పేరుతో ఇంటి పన్ను ఇప్పటికీ కడుతున్నారు. ప్రస్తుతం లబ్ధిదారుడి పేరు మీద ఇంటి పేపర్లు ఉండాలన్న నిబంధన వారికి ప్రతిబంధకంగా మారుతోంది. ప్రస్తుతం ఏలూరు రూరల్ మండలంలో వెయ్యి మందికి పైగా దరఖాస్తు చేసుకోగా వారిలో సుమారు 600 మందికి రుణాలు మంజూరు చేయగా సూర్యఘర్ యోజనలో రాయితీపై సోలార్ పరికరాలు అమర్చారు. ఇంకా 400 మందికి రుణమిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావడం లేదు. 3 కిలో వాట్ సోలార్ సెట్ రూ.2,10,000 కాగా, కేంద్ర ప్రభుత్వం రూ.78వేలు రాయితీ అందిస్తోంది. మిగిలిన దానిలో లబ్ధిదారుడి వాటా 10 శాతం రూ.21 వేలు చెల్లించాల్సి ఉంది. మిగిలిన రూ.1,32,000లను ఆయా గ్రామాల పరిధిలోని బ్యాంకు ద్వారా రుణం పొందాల్సి ఉంటుంది. సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని



ఆయా బ్యాంకులు రుణాలను తిరస్కరించడంతో కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నీరుగారిపోతోంది. సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా బ్యాంకులు రుణాలు మంజూరు చేయగలిగితే లబ్ధిదారులు మరింత ముందుకు వచ్చి సోలార్ సెట్లు ఏర్పాటు చేసుకుంటారు. ఈనేపథ్యంలో జిల్లా స్థాయి ఉన్నతాధికారులు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి, సోలార్ సెట్లు ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.



విష్ణువర్ధన్ సత్కరిస్తున్న నాయకులు

డిప్యూటీ ఎంపీడీవో విష్ణువర్ధన్‌కు సత్కారం

పెదవేగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయం డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన చింతమనేని విష్ణువర్ధన్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సత్కరించారు. ఏలూరు జడ్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విష్ణువర్ధన్ పదోన్నతిపై ఏలూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయం డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గాలాయగూడెం, ముందూరు సొసైటీ చైర్మన్‌లు పూజారి వెంకటరత్నం నాయుడు, కొనకళ్ల శివమణి, గాలాయగూడెం గ్రామ మాజీ సర్పంచ్ వేగుంట రాణికిశోర్, ఏనుగు రామకృష్ణ, బుజ్జిగోపాల్, పూజారి దుర్గారావు, మద్దాల దయానందరాజు తదితరులు విష్ణుకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నవ్య

గాలాయగూడెంలో వైద్య పరీక్షలు

దెందులూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని కుమార్తె చింతమనేని నవ్య అన్నారు. మండలంలోని గాలాయగూడెం శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని గాలాయగూడెం సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు పూజారి వెంకటరత్నం నాయుడితో కలిసి శ్రీసీతారామ విశాల పరపతి సంఘం, హేలాపురి లైన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించారు. ఏలూరు ఆంధ్రా ఆసుపత్రి,రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల గ్లోబల్ మెడికల్స్ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. బ్యాంక్ సెక్రటరీ సుబ్బారావు పాల్గొన్నారు.

లింగపాలెంలో వైద్య శిబిరం

లింగపాలెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): లింగపాలెంలో విజ్ఞానభారతి పాఠశాల ప్రిన్సిపాల్ కే మురళీకృష్ణ, లలితా సూపర్ స్పెషాలిటీఆసుపత్రి సంయుక్తంగా పాఠశాలవద్ద ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. జనరల్ సర్జన్, న్యూరోసర్జన్, ఆప్తమాలజిస్ విభాగాల నిపుణులు పాల్గొన్నారు. గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు జనరల్ సర్జన్ డాక్టర్ సాయిశ్రీనివాస్, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ విజయ్‌బాబు, న్యూరోసర్జన్ ఎస్‌శ్రీనివాస్‌లు గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలందించారు.



నేత్రపర్వంగా శివ కల్యాణం

ద్వారకాతిరుమల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న శివదేవుడి ఆలయంలో స్వామివారి కల్యాణం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని లోక కల్యాణార్థం జరిగిన ఈ కల్యాణతంతు భక్తులను అలరించింది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయంలోని ముఖమండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా, పార్వతీ సమేత శివయ్య కల్యాణ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు.

వీర వెంకయ్య ఎన్నిక పట్ల హర్షం

ఏలూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నాల్గవ తరగతి బీసీ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సి.హెచ్.వీర వెంకయ్య ఎన్నికయ్యారు. బీసీ ఉద్యోగి సి.హెచ్.వీర వెంకయ్య రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఏలూరులో 40 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 4వ తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. తాజాగా రాష్ట్ర కమిటీ వీర వెంకయ్య సేవలు గుర్తించి 4వ తరగతి బీసీ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించారు. రాష్ట్ర బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్‌వీఆర్ విఠల్‌కుమార్, తదితరులు వీర వెంకయ్యను అభినందించారు.



వీరవెంకయ్యను అభినందిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పోలవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలే ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. ఆదివారం పోలవరం మండలం ప్రగడపల్లిలో జరిగిన జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత పోలవరం మండల కేంద్రంలో జనసేన మండల కార్యదర్శి సిద్దన రాంబాబు నివాసంలో ఓ శుభకార్యానికి హాజరైన ఆయన అనంతరం గూటాలలో భక్తాంజనేయ స్వామి హనుమద్ వ్రతంలో పాల్గొన్నారు. మండల జనసేన అధ్యక్షులు గునపర్తి చిన్ని, ఉపాధ్యక్షులు తెలగంశెట్టి రాంప్రసాద్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఘంటసాల పాటలు అజరామరం

ఏలూరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఘంటసాల పాటలు అజరామరం అని పలువురు వక్తలు కొనియాడారు. ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ఆదివారం హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘంటసాల 13వ జయంతిని నిర్వహించారు. డాక్టర్ లంకా వెంకటేశ్వరరావు, దేవరకొండ వెంకటేశ్వర్లు పాల్గొని, ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెదపాటి రామకృష్ణ, ఆనంద నాయుడు, గురుశర్మ, జంధ్యాల కళ్యాణ శ్రీపుల్లభట్ల, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలోనే తృప్తి

ఏలూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా పేదలకు, విద్యార్థులకు, క్యాన్సర్ రోగులకు సహాయాన్ని అందిస్తున్న ఏలూరు సమాచార శాఖ టెక్నికల్ సబార్డినేటర్ నగరగంటి సత్య ప్రభాకర్, శ్రీహర్షిణి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఏలూరులోని అనే ప్రాంతాల్లో రోడ్డు పక్కన జీవనాన్ని సాగిస్తూ చలికి ఇబ్బంది పడుతున్న వారికి దుప్పట్లు, బిస్కెట్ ప్యాకెట్లు, పండ్లు అందజేశారు. ఇటీవల క్యాన్సర్ రోగులకు నగదు సాయం, స్కూల్ విద్యార్థులకు స్కూల్ బుక్స్ పంపిణీ చేశారు.

పీడీఎస్‌యూ జిల్లా విద్యా, వైజ్ఞానిక
తరగతులను జయప్రదం చేయండి

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మన్న మెమోరియల్ హాల్లో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించే పీడీఎస్‌యూ జిల్లా విద్యా, వైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయాలని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ.భూషణం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ధర్మన్న మెమోరియల్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూషణం మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు. విద్యార్థులను చైతన్య పరచడానికి విద్యా, వైజ్ఞానిక తరగతులు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. సిహెచ్.అనిల్, జి.లచ్చిరెడ్డి, కె.దానియేలు, ఎస్.కన్నయ్య పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

యూటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

ఏలూరు అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఏలూరు జిల్లా నూతన కార్యవర్గానికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బిసు భాషిణి, ఆర్.రవికుమార్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా శ్యాంబాబు, సహ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు, సుధారాణి, కోశాధికారిగా రంగమోహన్‌లను ఎన్నుకున్నారు. కార్యదర్శు లుగా విక్టర్, రాజు, అనురాధ, శివశంకర రావు, రాంబాబు, శ్రీధర్, దేవానందరావు, కమల్‌కుమార్, రవిశంకర్, అంజన, దుర్గాప్రసాద్, బాలకృష్ణ, దామోదర్, ఆడిట్ కన్వీనర్‌గా మోహన్‌రావు ఎన్నికయ్యారు.



అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

అర్జీల స్వీకరణలో ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నమ్మకం ఉండటం వల్లే తాము అధికారంలో ఉన్నామన్నారు. ప్రజల నమ్మకానికి అనుగు ణంగా చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన పేదలకు అందేలా చేయడంలో క్షేత్రస్థాయిలో నాయకులదే కీలకపాత్ర అని, ప్రభుత్వం అందించే పథకాలపై అవగాహన పెంచుకుని, వాటిని పేదలకు చేరేలా బాధ్యతను తీసుకోవాలని నాయకులకు ప్రభాకర్ సూచించారు.



నిమజ్జనానికి వెళ్తున్న భక్తులు

ఘనంగా శివాలయాల్లో పూజలు

భీమడోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):మార్గశిర మాసం, ఆరుద్ర నక్షత్రం పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయల్లో విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. భీమడోలులో కొలువైన పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని 12 మంది దంపతులు గ్రామస్తులు లింగార్చన నిర్వహించి పార్థివ లింగాన్ని గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు. ఆలయంలో అర్చకులు కాళ్ళకూరి విజయ శంకర శర్మ, విశివకుమార్‌లు విశేష రుద్రాభిషేకాలు నిర్వహించారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి అందిస్తున్న దృశ్యం

పార్టీలకతీతంగా సమస్యలు పరిష్కరించాలి

ఏలూరుటూటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దళిత జేఏసీ జాతీయ చైర్మన్ పెరికే వరప్రసాద్, అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పొలిమేర హరికృష్ణ అన్నారు. గన్‌బజార్‌లో సమితి కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ 3వ జాతీయ రౌండ్ టేబుల్ సమావేశం ఈ నెల 9న ఏలూరులో నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో 12 అంశాలపై చర్చ నిర్వహించి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై హైదరాబాదులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విన్నవించామని అన్నారు.

రజకుల సమస్యలపై స్పందించాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రజకుల వృత్తిపరమైన సమస్యల పట్ల అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని రజకజన సంఘ అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య కోరారు. శనివారం ఏలూరులోని జిల్లా రజక జన సంఘంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. కట్లయ్య మాట్లాడుతూ జిల్లాలోని రజకుల వృత్తి చెరువుల కేటాయింపులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కొలూరులోని చెరువు కేటాయింపుపై ఆర్డీవో, డివిజనల్ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించడం లేదని వాపోయారు. వి.శ్రీనివాసు, పొట్లూరి మురళి, బైయగూడెం లక్ష్మీ ప్రసన్న, కోమటిగుంట సూర్యచంద్రం, లింగాల రమేష్, లింగాల సోభన్, బాబు, సాంబశివరావు, నారాయణ, కొలూరి రజకులు, ఆయా మండలాల రజక నేతలు పాల్గొన్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన

కామవరపుకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ కె.విజయబాబు సూచనతో కళాశాల విద్య అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన కామర్స్ విభాగం ఆధ్వర్యంలో క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన కల్పించారు. బెంగళూరు ఇన్‌పాక్ట్ అనలైటిక్స్ సంస్థలో లీడ్‌డేవాప్స్ ఇంజనీర్ కావూరి ప్రదీప్ చంద్ర క్లౌడ్ కంప్యూటింగ్ నేర్చుకునే విధానాన్ని తెలియజేశారు. విద్యార్థులంతా దీనిపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, దారావతు మల్లేష్, బి.రాజు, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ, పి.కల్పన పాల్గొన్నారు.



సుధాకరరావు దంపతులను సన్మానిస్తున్న కార్మికులు

ఘనంగా ఉద్యోగ విరమణ సత్కారం

పెదవేగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఒక అధికారి పనితనం కిందిస్థాయి ఉద్యోగుల పనితీరుపై ఆధారపడి ఉంటుందని ఏపీ ఆయిల్‌ఫెడ్ కర్మాగారం మేనేజర్‌గా పదవీ విరమణ చేసిన ఉప్పాడ సుధాకరరావు అన్నారు. పెదవేగిలోని ఏపీ ఆయిల్‌ఫెడ్ కర్మాగారం సీనియర్ మేనేజర్‌గా పదవీ విరమణ చేసిన సుధాకరరావు, ఆయన సతీమణి కల్పనా దొరను ఆదివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో కర్మాగారం ఉద్యోగులు, కార్మికులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ 38ఏళ్ల ఉద్యోగ జీవితంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించానన్నారు.అన్నిచోట్లా కింది స్థాయి ఉద్యోగులు పనిలో చూపిన నిబద్ధత, చిత్తశుద్ధి వంటి అంశాలతో తాను మెరుగైన అధికారిగా రాణించానని చెప్పారు. సీనియర్ మేనేజర్‌గా పదవీ విరమణ చేసే సమయంలోనూ ఉద్యోగులు చూపిన ప్రేమాభిమానాలు ఎనలేనివని ఆయన ఉద్వేగంగా చెప్పారు. ఇన్‌చార్జి మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన శాంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారి సమర్థతపైనే కిందిస్థాయి ఉద్యోగుల పనితీరు ఆధారపడి ఉంటుందన్నారు. అలాంటి సమర్థత కలిగిన అధికారిగా సుధాకరరావు ఉన్నతాధికారుల ప్రశంసలు పొందడం గొప్ప విషయమన్నారు. డిప్యూటీ మేనేజర్లు వై.శ్రీనివాస్, ఆర్ఎస్వీ సత్యనారాయణ, పామాయిల్ రైతు సంఘ అధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, ఇష్టా ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు పాల్గొన్నారు.

దాళ్వా నారుమళ్లకు సన్నద్ధం

దెందులూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో సార్వా వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతుండగా మరోవైపు పంటలు దాదాపు పూర్తి కావస్తున్న నేపథ్యంలో కొవ్వలితో పాటు పలు గ్రామాల్లో రైతులు దాళ్వా సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. గోదావరి, కృష్ణా, సీతంపేట కాలువల పరిధితో పాటు మండలంలో 15వేల ఎకరాల్లో వరి సాగుకు రైతులు వరి నారుమళ్ల పనులు కొవ్వలి గ్రామ పరిధిలో రైతులు ప్రారంభించారు. గత కొద్ది రోజులుగా వాతావరణంగా బాగానే ఉండటంతో వరి పంటలు కోతలను పూర్తి చేసిన రైతులు తమ ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తరలించారు. కొంత మంది దాళ్వా పంటలో మంచి దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో నారుమళ్లు పోసే పనులు ప్రారంభించారు.

రాట్నాలమ్మకు పూజలు

పెదవేగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించినట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ చెప్పారు. పాలకవర్గ చైర్మన్ మన్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీఆర్సీ ఏర్పాటుకు డిమాండ్

ఏలూరు అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన పేస్కేళ్లు సిఫారసు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ జడ్జి అధ్యక్షతన పీఆర్సీని ఏర్పాటు చేయాలని ఆదివారం ఏలూరులోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్ఎస్వీ రామకృష్ణారావు, కార్యదర్శి ఎ.బంగారయ్య డిమాండ్ చేశారు. సమావేశంలో చర్చించిన విషయాలను సంఘ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ జే.గోవిందరావు స్థానిక మీడియాకు వివరించారు. సంఘ నాయకులు నీలిమాదేవి, పెద్దిరాజు, షేక్ ఖలీల్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, భీమడోలు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, ఏలూరు తాలూకాల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చాటపర్రు సెక్షన్ 33 కేవీ గుడివాక లంక సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్ ఏర్పాటు నిమిత్తం సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు ప్రతి కోళ్ళలంక, పేదయాగనమిల్లి, కొమటిలంక, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సాయికిరణ్ ఎన్నిక



కుక్కునూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల కార్యదర్శిగా యర్రం సాయి కిరణ్ ఎన్నికయ్యారు. ఆదివారం కుక్కునూరులో సీపీఎం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా సాయి కిరణ్ ఎంపికతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, వై.నాగేంద్రరావు, నాగమణి ఉన్నారు.

15న కలెక్టరేట్ వద్ద ధర్నా

కామవరపుకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఏపీ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఈనెల 15న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఐఎఫ్‌టీయూ అధ్యక్షులు కాకర్ల శ్రీను, నౌడు నెహ్రూబాబులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

పెదపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం నాయుడుగూడెం గ్రామంలో కోడిపందెం ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ శారదా సతీశ్ సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని ఆదివారం అరెస్ట్ చేశా రు. వారి నుంచి రెండు కోడికత్తులు, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత కంటి పరీక్షలు

ఏలూరు,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని పుష్పలీలానగర్ సరస్వతి విద్యాలయంలో డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత కంటి పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్ పీఎస్ఆర్ ఆప్టికల్స్ ప్రొపయిటర్ మజ్జి నాగరాజు, డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్లు శాంతా విజయలక్ష్మి వివేకవర్ధన్‌లు పిల్లలకు 150 మంది కంటి పరీక్షలు చేశారు.



వీర బ్రహ్మానికి ఐకాన్ అవార్డు

చింతలపూడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చింతలపూడికి చెందిన మందగుల కనకలింగ వీరబ్రహ్మాంకు ఢిల్లీకి చెందిన తెలుగు సంస్కృతి, సాహితీ సేవా ట్రస్టు ఐకాన్ అవార్డు ఆదివారం ఢిల్లీలో అందచేసింది. శిల్పకళా బ్రహ్మ అవార్డు పొందిన కనకలింగ వీరబ్రహ్మాం శిల్పకళలో చూపిన ప్రతిభ, నైపుణ్యం గుర్తించి ఈ అవార్డు అందించారు. సంస్థ నిర్వాహకులు మాచవరం గౌరీశంకర్ చేతుల మీదుగా వీరబ్రహ్మాం దంపతులను శాలువా కప్పి అవార్డు అందించారు.

300 మందికి ఉచిత కంటి పరీక్షలు

కలిదిండి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కలిదిండి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఎం.మారుతీ ప్రసన్న, వెంకటేశ్వరరావు, ఐడియల్ విజన్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 300 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు పెనుమత్స కృష్ణచైతన్య, సూర్య సౌమిత్, భాస్కరరాజు వైద్యసేవలు అందించారు. కూటమి నాయకులు గొరిపర్తి సత్తిబాబు, గొట్టుముక్కల సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

ఆగిరిపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా వంద రోజుల ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఎంఈవోలు ఎస్. హెబేలు, కె. ఆనంద్‌కుమార్ తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సెలవు రోజుల్లో కూడా విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తామని అన్నారు.

నేడు నూజివీడులో సహకార సదస్సు



విలేకరులతో మాట్లాడుతున్న విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు

నూజివీడు టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని నూజివీడు అమర్‌భవన్‌లో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు సహకార సదస్సును నిర్వహిస్తున్నట్టు విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సదస్సుకు అతిథులుగా నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్, నాఫ్‌క్యాబ్ డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు. సహకార రంగాన్ని విస్తృతం చేయాలన్న లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి 2025వ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందన్నారు. ప్రపంచంలో ప్రధాన సమస్యలైన పేదరికం, ఆర్థిక అసమానతలు వంటి అనేక సవాళ్లను ఎదుర్కోవడానికి సహకార రంగ పాత్ర ప్రధానమన్నారు. బ్యాంకు సిబ్బంది బంక వెంకట శివశంకర్, నక్క రామకృష్ణ, పొట్టిక అన్నవరం, బొబ్బిలి శివ, గౌరీ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యాన్ని మిల్లర్లకు పంపిస్తున్న దృశ్యం

నూజివీడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం బత్తుల వారిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ మునునూరి లక్ష్మీ కాంతమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం సేకరించిన 48 గంటలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నగదును చెల్లిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో ధాన్యం డబ్బుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నుంచి కొనుగోలు చేసిన వెంటనే నగదు బ్యాంకులో జమ అయ్యేలా సీఎం చంద్రబాబు నిర్ణయంతో కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వంగా మారిందన్నారు. టీడీపీ నూజివీడు మండల మాజీ అధ్యక్షుడు మునునూరి రాజా, టీడీపీ నాయకులు మండాడి తిరుపతి రావు, మూడు తిరుపతిరావు, గరికిపాటి పూర్ణ, కొలుసు అంజనేయులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



సర్పంచ్‌కు బల్బుల సెట్లు అందజేస్తున్న గ్రోవెల్ ప్రతినిధులు

ఈడేపల్లి పంచాయతీకి బల్బుల సెట్ల వితరణ

ముదినేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం గ్రోవెల్ ఫిష్ ఫీడ్స్ కంపెనీ యాజమాన్యం ముదినేపల్లి మండలం ఈడేపల్లి పంచాయతీకి సుమారు 75 ఎల్‌ఈడీ వీధి దీపాల సెట్లను విరాళంగా అందజేసింది. సుమారు రూ. 2.50 లక్షల విలువ కలిగిన ఈ బల్బుల సెట్లను ఆదివారం ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ అబ్బిశెట్టి వెంకటేశ్వరరావుకు కంపెనీ జనరల్ మేనేజర్ గారపాటి సత్యనారాయణ, చీఫ్ ఫైనాన్సియల్ మేనేజర్ రంగాచారి అందజేశారు. కంపెనీ మేనేజర్ లింగారెడ్డి చౌదరి, డిప్యూటీ మేనేజర్ కీర్తి, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు. దీంతో ఆ పంచాయతీ ఏరియాలో విద్యుత్ సౌకర్యం మెరుగుపడనుంది.

వృద్ధులకు బియ్యం, దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మానవత సభ్యులు

కైకలూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలో వృద్ధులకు క్వింటాలు బియ్యం, దుప్పట్లను మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. ఆదివారం కైకలూరు మం డలం తామర కొల్లులోని మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వీటిని పంపిణీ చేశారు. మానవత సంస్థ చైర్మన్ కొండ్రెడ్డి చిట్టెమ్మ, ప్రధాన కార్యదర్శి బోయిన సత్యసూర్య ప్రభావతి బియ్యాన్ని అందించారు. అలాగే సంస్థ ఆధ్వర్యంలో 40 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు చిట్టెమ్మ మాట్లాడుతూ నేటి సమాజంలో తల్లిదండ్రులను అనేకమంది దూరం చేసుకుంటున్నారని అయితే వృద్ధుల సహాయార్థం సంస్థ ఆధ్వర్యం లో రెండు పూటల వారి ఇళ్లకే భోజన క్యారియర్‌లను పంపించడం అభినందనీయమన్నారు. సంస్థ మండల అధ్యక్షుడు గుర్రం శ్యాంకుమార్, సంస్థ సభ్యులు ఇమ్మడి పాండురంగ విఠల్, తులాల మోహన్, తలారి వేణుగోపాలరావు, బుద్దగిరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఇరు జట్ల క్రీడాకారులతో ట్రిపుల్ ఐటీ సిబ్బంది

వాలీబాల్ విజేత నూజివీడు బాలుర జట్టు

నూజివీడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు శ్రీకాకుళం స్పోర్ట్స్ బోర్డు ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్వర్యంలో మూడు రోజుల పాటు ఇంటర్ వర్సిటీ స్పోర్ట్స్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కే ధన బాలాజీ ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించగా చెస్, వాలీబాల్ క్రీడల్లో ప్రధానంగా పోటీ సాగింది. బాలుర వాలీబాల్ విభాగంలో నూజివీడు క్యాంపస్ శ్రీకాకుళంపై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకోగా శ్రీకాకుళం ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల వాలీబాల్ విభాగంలో శ్రీకాకుళం టీం నూజివీడు జట్టుపై విజయం సాధించి విజేతగా నిలిచింది. విజేతలకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ధన బాలాజీ ట్రోఫీలను అందించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ అభినందించారు. అకడమిక్ డీన్ శివరామకృష్ణ, గేదెల రవి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు దిలీప్‌కుమార్, కృష్ణంరాజు, సుబ్బలక్ష్మీ, డాక్టర్ నవీన్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

వాహనాలు రయ్.. రయ్..



కలిదిండి జడ్పీ హైస్కూల్ వద్ద రద్దీగా ఉన్న రాష్ట్ర రహదారి

- గతంలో జరిగిన రహదారి ప్రమాదంలో విద్యార్థి మృతి
- నాడు ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్లు రహదారి మరమ్మతులతో అదృశ్యం
- తక్షణం ఏర్పాటుకు తల్లిదండ్రుల వినతి

కలిదిండి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కలిదిండి జడ్పీ హైస్కూల్ వద్ద ఉన్న రాష్ట్ర రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్‌అండ్ బీ అధికారులకు విన్నవిస్తున్నారు. స్కూల్ విడిచిన తర్వాత విద్యార్థులంతా ఒక్కసారిగా రహదారిపైకి రావటం తో వాహనాలు విద్యార్థులను ఢీకొని గాయాలపాలవుతున్నారు. జడ్పీ హైస్కూల్ సమీపంలో బీసీ బాలికల హాస్టల్, ఎస్సీ బాలుర హాస్టల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నాయి. నిత్యం విద్యార్థుల రాకపోకలతో రహదారి రద్దీగా ఉంటుంది. గతంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. రెండు నెలలు క్రితం రాష్ట్ర రహదారి మరమ్మతులు చేపట్టినప్పుడు స్పీడ్ బ్రేకర్లకు సమాం తరంగా రహదారిపై మెటల్ వేశారు. దీంతో జడ్పీ హైస్కూల్ వద్ద రహదారి సమాం తరంగా ఉండి వాహనాలు వేగంగా వెళ్తుండటంతో తరచు విద్యార్థులు ప్రమాదాల్లో గాయపడుతున్నారు. గతంలో కారు ఢీకొని జడ్పీ హైస్కూల్ విద్యార్థి అక్కడి కక్కడే మృతి చెంద టంతో అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. మళ్లీ విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



మర్లపాలెం ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

మర్లపాలెం రహదారికి మహర్దశ

చాట్రాయి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మర్లపాలెం ప్రధాన రహదారి సమస్య తీరనుంది. రమణక్కపేట-పోలవరం ఆర్‌అండ్‌బీ రహదారి పరిధిలో ఉన్న మర్లపాలెంలో ప్రధాన రహదారి వర్షాకాలంలో బురదకయ్యగా మారి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇటీవల మర్లపాలెం పర్యటనకు వచ్చిన మంత్రి పార్థసారథికి టీడీపీ నాయకుడు వెల్ది రాజారావు, గ్రామస్థులు సమస్యను మంత్రికి వివరించటంతో 800 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ 1.60 కోట్లు నిధులు మంజూరు చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏలూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే శాఖ ఏలూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనుంది. రైల్ నెంబర్ 07148 చర్లపల్లిలో ఈ నెల 8వ తేదీ రాత్రి 9.35 గంటలకు బయల్దేరి 9వ తేదీ రాత్రి 11.50 గంటలకు షాలి మార్ చేరుకుంటుంది. రైల్ నెంబర్ 07149 షాలిమర్ లో ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 12.10 గంట లకు బయల్దేరి 11వ తేదీ సాయంత్రం 4 గంట లకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రెండు రైళ్లు గుంటూరు జంక్షన్, విజయవాడ జంక్షన్, ఏలూ రు, రాజమండ్రి, సామర్లకోట జంక్షన్, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం జంక్షన్, శ్రీకాకుళంరోడ్, బరంపూర్, కూర్థా రోడ్ జంక్షన్, భువనేశ్వర్, కటక్, బాద్రక్, బాలసూర్, కరగ్‌పూర్ జంక్షన్, సత్రగంజి స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్లల్లో టూటైర్ ఏసీ, త్రి టైర్ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని తెలిపారు.

అద్వితీయం



- సేవలు సమృద్ధి.. భక్తజనం సంతృప్తి..
- భక్తులకు సేవల ర్యాంకింగ్‌లో ద్వారకా తిరుమల శ్రీవారి క్షేత్రానికి రెండో స్థానం
- ఫీడ్‌బ్యాక్‌తో ప్రజాభిప్రాయ సేకరణ

ద్వారకాతిరుమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు వచ్చే భక్తులకు దేవతా మూర్తుల దర్శనంతోపాటు, మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన ప్రసాదం అందించడం అక్కడి అధికారుల కనీస బాధ్యత. దీనిపై అటు ప్రభుత్వంతో పాటు ఇటు ఆలయ ఉన్నతాధి కారులు సైతం దృష్టి సారించారు. ఈ క్రమంలో భక్తులకు ఫోన్లు చేసి ఆలయాల్లో అందే సేవలపై అభిప్రాయాలు సేకరించారు. రాష్ట్ర దేవాల యాల్లో భక్తులకు అందే సేవలపై గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది నవంబరు నెల వరకు అభిప్రాయాలు సేకరించారు.

సర్వే జరిగిందిలా..

రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో భక్తులకు మెరుగైన సేవలందించాలని ప్రభుత్వం ఎప్పటి కప్పుడు సూచిస్తూనే ఉంది. అయితే కొందరు అధికా రులు ఆ ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ఆశించిన స్థాయిలో భక్తులకు సేవలు అందడం లేదనే వాదన వినిపిస్తోంది. భక్తులకు గత ఏడాదిన్నర కాలంగా అక్కడ అందే సేవలపై ప్రభుత్వం ఆరా తీసింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని జాయింట్ కమిషనర్ హోదా కల్గిన ప్రధాన 7 ఆలయాలను ఒక విభాగంలోను, డిప్యూటీ కమిష నర్ హోదా కల్గిన 14 ముఖ్య ఆలయా లను మరో విభాగంలోను చేర్చారు. భక్తులకు ఫోన్లు చేసి వారు దర్శించిన ఆలయం ఏది.. అక్కడ వారి సౌకర్య, అసౌకర్యాలపై అభి ప్రాయ సేకరణ జరిపారు. దైవ దర్శనంలో ఇబ్బందు లెదుర్కొన్నారా... ఆలయాల్లో తాగు నీరు, వసతులు, పారిశుధ్యం సంతృ ప్తినిచ్చాయా.. అన్న అం శాలపై భక్తుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసు కుని పర్సంటేజ్‌లు కేటాయించారు.

● రాష్ట్రంలోని ఏడు ప్రధాన ఆలయాల్లో ఒక టైన ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చిన భక్తు లకు మెరుగైన సేవలందించడంలో 71.5 శాతం తో రెండో స్థానం లభించగా సంతృ ప్తకరమైన స్థాయిని దక్కించుకుంది. స్వామి వారి దర్శనం సంతృప్తికరంగా ఉందా... మౌలిక సదుపా యాలు బాగున్నాయా... ప్రసాదం తాజాగా, రుచిగా ఉందా అన్న ప్రశ్నలతో భక్తుల నుంచి సేకరించిన ఫీడ్ బ్యాక్ ద్వారా ఈ స్థానం లభించింది. శ్రీకాళ హస్తి 72.7 శాతంతో ప్రథమ స్థానంలో నిల వగా, 70.4తో మూడో స్థానంలో శ్రీశైలం, 70 శాతంతో నాలుగో స్థానంలో కాణి పాకం, 68.8తో సింహాచలం ఐదో స్థానం, 67.8తో అన్నవరం ఆరో స్థానంలో నిలవగా చివరి స్థానంలో 66 శాతం సంతృప్తితో ఇంద్ర కీలాద్రి దుర్గమ్మ ఆలయం నిలిచింది. ఉప కమి షనర్ హోదా కల్గిన రాష్ట్రంలోని 14 ముఖ్య ఆల యాల్లో మోపిదేవి ఆలయం, నిడదవోలు కోట సత్తెమ్మ ఆలయాలు 70.2 శాతంతో మొదటి స్థానంలో ఉన్నాయి.

మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం..



స్వయంవ్యక్తమూర్తిగా చినవెంకన్న ద్విమూర్తులుగా కొలువుదీరిన ద్వారకా తిరుమలను ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు సూచనలతో మరింత అభివృద్ధి చేస్తాం.. ఇప్పటికే అంతరాలయ దర్శనాన్ని పునరు ద్ధరించాం... అలాగే పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచేలా చర్యలు తీసుకుంటున్నాం.. శుద్ధమైన తాగునీటిని, రుచికరమైన ప్రసాదాలను భక్తులకు అందజేస్తున్నాం. కోట్లాది రూపాయలు వెచ్చించి ఎన్నో సౌకర్యాలను కల్పిస్తున్నాం.. భక్తులకు భవిష్యత్‌లో చక్కని దైవదర్శనంతో పాటు మెరుగైన సౌకర్యాలు మరిన్ని కల్పిస్తాం.

-ఎన్వీ సత్యన్నారాయణమూర్తి,
ఆలయ ఈవో, ద్వారకాతిరుమల



సింగరాయపాలెంలో షష్టి వలంటీర్లను అభినందిస్తున్న సీఐ రవికుమార్

షష్టి వలంటీర్లకు అభినందన

ముదినేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరిగిన షష్టి కల్యాణోత్సవాల్లో స్వచ్ఛంద సేవలందించిన వలంటీర్లను ఆలయ, పోలీస్ అధికార్లు ఘనంగా సత్కరించారు. ఉత్సవాల నిర్వహణలో సహకరించిన ముదినేపల్లి వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులను ఆలయ ఎసి గంగా శ్రీదేవి, సీఐ రవికుమార్, ఎస్‌ఐ వీరభద్రరావు, ఉత్సవ కమిటీ సభ్యులు అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి స్థల పరిశీలన



చనుబండలో పీహెచ్‌సీ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సారథి

- చనుబండలో దాత విరాళంగా ఇచ్చిన స్థలాన్ని పరిశీలించిన మంత్రి సారథి

చాట్రాయి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండలో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి దాత విరాళంగా ఇచ్చిన స్థలాన్ని మంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించారు. స్థలం లోతుగా ఉండడంతో మెరక చేసేందుకు అధికంగా వ్యయమవుతుందని మంత్రి అంచనా వేశారు. అయితే మెరకకు అయ్యే ఖర్చులో 50 శాతం తాము భరాయిస్తామని దాత సోదరుడు మల్లెల శేషగిరిరావు తెలిపారు. ఊరికి దగ్గరలో స్థలం విరాళంగా ఇవ్వటానికి దాతలు ముందుకు రావటం లేదని, ఈ స్థలాన్ని చనుబండ గ్రామానికి చెందిన ఎన్నారై మల్లెల శ్రీనివాస్ రూ. 25 లక్షలతో కొనుగోలు చేసి పీహెచ్‌సీకి విరాళంగా ఇచ్చారని, వైసీపీ హయాంలో ఈ స్థలంలో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి రెండు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని నాయకులు మంత్రికి వివరించారు. దీనిపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి, త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలు డ్రెయిన్లు, సీసీ రోడ్లు, సాగునీరు, కల్వర్టులు మొదలైన సమస్యలు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు చీదిరాల మారేశ్వరరావు, టీడీపీ నాయకులు ములగలపాటి శ్రీనివాసరావు, కందుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద పరీక్షే!

(5వ పేజీ తరువాయి)

రోజుల్లో సైతం నిర్వహించే ప్రత్యేక తరగతులను విద్యార్థులు నూరుశాతం విజయవంతంగా వినియోగించుకునేందుకు వీలుగా ఆయా రోజుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయడానికి విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులిచ్చింది.

విద్యాశాఖేతర అధికారులతో టీచర్లను అగౌరవపరుస్తారా?

వందరోజుల కార్యాచరణను హైస్కూలు స్థాయిలో విద్యాశాఖేతర అధికారులతో పర్యవేక్షింపజేయడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నాయి. బోధనా కార్యక్రమాలు, పాఠ్యాంశాలు, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలతో పరిచయం లేని ఇతరశాఖల అడాప్షన్ ఆఫీసర్లు రోజువారీ పర్యవేక్షణతో ఉపాధ్యాయుల తప్పులను వెతకడానికే ప్రాధాన్యతనిస్తారని అభ్యంతరం చెబుతున్నాయి. అవసరమైతే విద్యాశాఖకు సంబంధించిన సీనియర్ హెచ్‌ఎంలు, డైట్ కళాశాలల అధ్యాపకులు, డీవైఈవోలు, ఎంఈవోలతో వందరోజుల కార్యాచరణను రోజువారీగా పర్యవేక్షించుకోవడానికి నియమించుకో వాలని డిమాండ్ చేస్తున్నాయి. గతంలోను టెన్త్ పరీక్షార్థులకు వంద రోజుల కార్యాచరణను అమలు చేసినప్పటికీ ఇప్పటి మాదిరిగా ఇతర శాఖల నుంచి అడాప్షన్ ఆఫీసర్లను పర్యవేక్షకులుగా నియమించలేదని గుర్తుచేస్తున్నాయి. దీనిపై ఏపీటీఎఫ్-1938 జిల్లా నాయకులు కృష్ణ, మోహన్, శ్రీనివాసరావు మాట్లాడుతూ వందరోజుల కార్యాచరణతో ఉపాధ్యాయులపై అనవసరమైన పనిభా రం పెరుగుతుందని, పాఠ్యాంశాల రివిజన్ తగ్గిపోవడం వల్ల ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొ న్నారు. ఉపాధ్యాయులు బోధన కంటే లీప్ యాప్‌లో అప్‌లోడ్, డేటా ఎంట్రీ పనులకే ఎక్కువ సమయం ఇవ్వాల్సి ఉంటుందని, ఇది బోధనేతర పనులతో టీచర్లను వేధించడమేనని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతర శాఖల అధికారులకు పర్యవేక్షణ అప్పగించడం, యాప్‌లో టీచర్లే మార్కులు అప్‌లోడ్ చేయాల్సి రావడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అవసరమైతే లీప్ యాప్‌లో మార్కులను అప్‌లోడ్‌చేసే బాధ్యతను సీఆర్పీ/సీఎంఆర్టీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు.



కొలుసు పెద్ద రెడ్డియ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో

ఉచిత ట్యూషన్ సెంటర్లు ప్రారంభం

చాట్రాయి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొలుసు పెద్ద రెడ్డియ్య ట్రస్ట్ తరుపున మండలంలోని బూరుగుగూడెం, ఆరుగొలనుపేట గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత ట్యూషన్ సెంటర్లను శనివారం రాత్రి ట్రస్ట్ కన్వీనర్ కొండవరద గోపీకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి కొలుసు పార్థసారథి తన తండ్రి పేరున ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, సర్కార్ బడుల్లో చదివే పేద పిల్లలు చదువుల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు బీఈడీ ఉపాధ్యాయులతో ట్యూషన్లు చెప్పించటం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో నూజివీడు నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ట్యూషన్ సెంటర్లు ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తేళ్ళూరి శేఖర్, కాలసాని సూర్యనారాయణ, గ్రంధాల జయప్రకాష్, కాసర గోవర్ధనరెడ్డి, పానుగంటి కేశవరావు, వెల్లంకి శ్రీమన్నారాయణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన షష్టి ఉత్సవాలు.. భారీ అన్నసమారాధన



షష్టి సమారాధన పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులో వేంచేసియున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో 13 రోజులుగా జరుగుతున్న సుబ్రహ్మణ్య షష్టి కల్యాణోత్సవాలు ఆదివారం విజయ వంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో మహా అన్న సమారాధన జరిగింది. కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నసమారాధనను ప్రారంభించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు దేవదాయశాఖ అధికార్లను, ఉత్సవ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవి కుమార్, బెజవాడ రాధాకృష్ణ, పరసా కృష్ణ, నీలం శివ రమేష్, శొంఠి నాగకొండ, వి. నాగలలిత, టీడీపీ నియోజకవర్గ కన్వీ నర్ వీరమల్లు నరసింహారావు, శ్రీహరి పురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు తదితరులు అన్న సమారాధనను పర్య వేక్షించారు. షష్టి ఉత్సవాల చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు పుట్టలో పాలుపోసి సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకున్నారు. దేవస్థానంలో 24 గంటల పాటు రంగిశెట్టి అంజిబాబు దంపతులు నిర్వహించిన ఏకాహం ముగిసింది. ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో కైకలూరు రూరల్ సీఐ కుమార్, ముదినేపల్లి, మండవల్లి ఎస్‌ఐలు వీరభద్రరావు, రామచంద్రరావు, సుమారు 120 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. గురజ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కూటమి నాయకులు కొత్తూరు విఠల్, కోడూరు శేషుబాబు, శొంఠి నాగరాజు తదితరులు పాల్గొని పూజలు జరిపారు.

రబీకి.. సన్నద్ధం!

(5వ పేజీ తరువాయి)

12,305 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,727 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకే 17,865 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 4,034 మెట్రిక్ టన్నులు, ఎస్‌ఎస్‌పి 6,828 మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధంగా ఉంచారు. రబీ సీజన్‌లో ఈ ఎరువులను రైతులు వినియోగించుకోవచ్చు.

60.49 శాతం వరి మాసూళ్లు పూర్తి

జిల్లాలో ఈ ఏడాది సార్వా సీజన్‌లో 2,07,286 ఎకరాల్వో వరి సాగు జరిగింది. ప్రస్తుతం వరి మాసూళ్ళ పర్వం జోరుగా సాగుతోంది. ఇప్పటివరకు 1,25,402 (60.49 శాతం) ఎకరాల్లో వరి మాసూళ్ళు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో వరి మాసూళ్ల పర్వం త్వరితగతిన పూర్తయితే రబీ వరి నారుమళ్ల ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా 'చిరిగిరి'



మండవల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం పాఠశాల హెచ్‌ఎం చిరిగిరి పిచ్చేడు మాస్టర్ యూటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఏలూరు జిల్లా దెందులూరులో ఆది వారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పిచ్చేడు మాస్టారును జిల్లా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనను కైకలూరు నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు అభినందించారు.

బలివేలో స్వామి వారికి విశేష పూజలు



ముసునూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బలివే రామ లింగేశ్వర స్వామికి ఆదివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తోలేటి అరుణ భాస్కర రావు ఆధ్వర్యం లో స్వామివారికి పంచామృతాభిషేకం, భస్మాభిషేకం తదితర వాటిని నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు చేశారు. అలాగే రాజరాజేశ్వరి దేవికి కుంకుమార్చనలు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, ఈవో పామర్తి సీతారామయ్య, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్ని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఆగిరిపల్లిలో మల్లికార్జునుడికి...



ఆగిరిపల్లి: స్థానిక శోభన గిరిపై వేం చేసి ఉన్న శ్రీదుర్గా పార్వతీ సమేత మల్లి కార్జున స్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్ష త్రం ఆరుద్ర సందర్భం గా ఆదివారం విశేష పూజలు నిర్వ హించా రు. ఆలయ అర్చకులు దేవులపల్లి శ్రీనివాస్‌మూర్తి స్వామివారికి పంచామృ తాలతో అభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష అలంకరణ నిర్వహించారు.

హత్యాయత్నం ఘటనలో ఇద్దరికి రిమాండ్

ముదినేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చిగురుకోట శివారు నరసన్నపాలెం గ్రామం వద్ద శనివారం సాయంత్రం ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడిన స్వల్ప వివాదం ఘర్షణగా మారి ఒక వ్యక్తిపై హత్యాయత్నం జరిగిన ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ఘటనలో నర్సన్నపాలెంలో చేపల చెరువులు లీజుకు తీసుకున్న మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం గ్రామానికి చెందిన బోనం దేవి కోటేశ్వర ప్రసాద్‌పై పగులగొట్టిన మద్యం బాటిల్‌తో దాడి చేసి అతని గొంతులో గుచ్చి తీవ్ర గాయాలకు గురి చేసిన నిందితులు బోయిడి రామకృష్ణ, బత్తుల సత్యనారాయణ అనే ఇద్దరు వ్యక్తులను ఆదివారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. బాధితుడు ప్రసాద్ గుడివాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇంకా అపస్మారక స్థితిలోనే ఉన్నాడు. నిందితులను కైకలూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా వారికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు.